క్లుప్తంగా

సీఎంతో ఎన్ఆర్ఐ స్టార్ క్యాంపెయినర్


సీఎం జగన్‌ను కలసిన దీప

బంగారుపాళెం : మండలంలోని పెరుమాళ్లపల్లెకు చెందిన ఎన్ఆర్ఐ స్టార్ క్యాంపెయినర్ దీప శుక్రవారం నెల్లూరులో సీఎం జగన్‌ను కలసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వైద్య సలహాదారు, ఎన్ఆర్ఐ డాక్టర్ నలిపిరెడ్డి వాసుదేవరెడ్డి సతీమణి దీప వైఎస్సార్‌సీపీ యూఎస్ఏ స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా పార్టీ గెలుపు కోసం ప్రచారం సాగిస్తున్నట్లు దీప తెలిపారు.

కుంభాభిషేకం పూజల్లో సునీల్‌కుమార్


సుదర్శన హోమ పూజల్లో సునీల్‌కుమార్

ఐరాల: మండలంలోని మోటకాంపల్లెలో శ్రీ సత్యమ్మ తల్లి ఆలయ కుంభాభిషేకం పూజల్లో శుక్రవారం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు. సునీల్‌కుమార్‌కు ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఆవరణలో సుదర్శన హోమ పూజలు చేశారు. అనంతరం అర్చకులు శ్రీ సత్యమ్మ తల్లికి వివిధ పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు.

విజయవంతంగా పింఛన్ల పంపిణీ

ఐరాల: మండలంలో పింఛన్ల కార్యక్రమం విజయవంతంగా జరిగింది. మూడో రోజు శుక్రవారం 19 గ్రామ సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పింఛన్ల పంపిణీ చేశారు. ఇప్పటి వరకూ 95.4 శాతం పూర్తయింది. పింఛన్ల కోసం వచ్చిన వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా గ్రామ సచివాలయాల వద్ద టెంట్లు వేసి కుర్చీలు, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేశారు. ఒక్కొక్క గ్రామ సచివాలయం వద్ద రద్దీకి అనుగుణంగా కౌంటర్లు ఏర్పాటు చేసి పింఛన్లు అందజేశారు. శుక్రవారం నాటికి మండలంలో 95.4 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ వెంకటేశు తెలిపారు. మండలంలో 10,065 పింఛన్లు ఉండగా 9,602 మందికి పంపిణీ చేసినట్లు ఆయన చెప్పారు. మిగిలిన వారికి ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేస్తామన్నారు.

పింఛన్ కోసం వెళ్లి వృద్ధురాలికి గాయాలు


చికిత్స పొందుతున్న మెహరూన్‌బీ

యాదమరి (పూతలపట్టు): పింఛన్ కోసం వెళ్లిన వృద్ధురాలు ప్రమాదానికి గురై ఆస్పత్రి పాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని వరదరాజులపల్లెకు చెందిన మెహరూన్‌బీ(70) నడవలేని స్థితిలో ఉన్న ఆమె గురువారం కొయ్యసాయంతో నడుచుకుంటూ సచివాలయానికి బయలుదేరింది. సచివాలయం లోపలనున్న గేటు తలిగి ఆమె కింద పడిపోయింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని చిత్తూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. మెహరూన్‌బీని పరీక్షించిన వైద్యులు ఎడమ చెయ్యి విరిగినట్లు గుర్తించారు. దీనిపై స్పందించిన మెహరూన్‌బీ కొడుకు మహమ్మద్ రఫీ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి పింఛన్‌లు అందజేసేవారని, ఈ నెల ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. వలంటీర్లు వచ్చి పింఛన్ ఇచ్చింటే తన తల్లి సచివాలయం వరకు వచ్చేదే కాదని, ఇలాంటి ప్రమాదాలు జరిగేవి కావని తెలిపారు. వలంటీర్ల విలువ వారు లేనప్పుడే తెలుస్తుందని తెలిపారు.

భానుడి భగభగలు



- బెంబేలెత్తిపోతున్న జనం
- ఉదయం 10 గంటల నుంచి మండుతున్న ఎండలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యశాఖ

చిత్తూరు రూరల్: పరీక్షల సమయం భానుడు భగభగ మండుతున్నాడు. కాలు బయటపెడితే నడినెత్తిన ఎండ సుర్రుమంటోంది. దీంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఏప్రిల్ మొదటి వారంలోనే ఇంత తీవ్రత ఉంటే మేలో పరిస్థితి తలుచుకుంటేనే భయం వేస్తోంది. రోజురోజుకూ భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఎండతీవ్రతకు వడగాడ్పులు తోడవడంతో తాళలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎండ తీవ్రత వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. ఎండ వేడిమి ఎక్కువగా ఉన్న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్యలో తిరగడం, ప్రయాణం చేయడం వల్ల వడదెబ్బ బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఎక్కువగా వడదెబ్బ బారిన పడతారు. ఈ నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా వైద్య ఆరోగ్యశాఖ ముందస్తుగా అప్రమత్తం చేసింది. విద్యార్థులు ఒంటి పూట బడి ముగించుకుని మధ్యాహ్నమే ఇంటికి చేరేలా విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమైన పనులుంటే మాత్రం ప్రజలు మధ్యాహ్నం వేళ బయటకు రావాలని, లేకుంటే ఇళ్లలో ఉండడమే ఉత్తమమని అధికారులు సూచిస్తున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ, కళ్లద్దాలు ధరిస్తే మంచిదని నిపుణులు చెబుతున్నారు.

వడదెబ్బ లక్షణాలు

- చెమట పట్టక పోవడం
- శరీర ఉష్ణోగ్రత పెరగడం
- వణుకు పుట్టడం
- కలవరింతలు, ఫిట్స్ రావడం
- పాక్షికంగా అపస్మారక స్థితి

ఎండలో బయటకు వెళ్లినప్పుడు ఈ లక్షణాలు కనిపిస్తే సమీపంలోని వైద్యుడిని సంప్రదించి ప్రాథమిక చికిత్స పొందాలి.

పీహెచ్‌సీల్లో...

ప్రజల సౌకర్యార్థం జిల్లాలో ఉన్న పీహెచ్‌సీలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ వద్ద వైద్యారోగ్య శాఖ ఓఆర్ఎస్ కార్నర్లను ఏర్పాటు చేసింది. ముఖ్యంగా ఉపాధి కూలీలు ఎండలో పనిచేయడం వల్ల డీహైడ్రేషన్‌కు గురవుతారు. వారి కోసం ఆశావర్కర్ల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నారు. వారు నిర్ణీత వేళల్లో మాత్రమే పనులు చేసేలా అధికారులు అవసరమైన అన్ని చర్యలు చేపట్టారు.

ప్రథమ చికిత్స...

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి తీసుకెళ్లాలి. చల్లని నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరమంతా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు అలా చేస్తూ ఉండాలి. ఫ్యాన్ గాలి లేదా చల్లని గాలి తగిలేలా చూడాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం గానీ ఓఆర్ఎస్ ద్రావణం గానీ తాగించాలి. కోమాలో ఉన్న వ్యక్తికి నీరు తాగించకూడదు. వీలైనంత త్వరగా దగ్గరలో ఉన్న పీహెచ్‌సీకి తీసుకువెళ్లాలి.

రోజు వారీ జ్వరం ఓపీ వివరాలు

తేది	సంఖ్య
1	1,256
2	1054
3	2065
4	1895
5	2254

ఉష్ణోగ్రత వివరాలు

తేది	గరిష్ఠ ఉష్ణోగ్రత
1-04-2024	38 డిగ్రీలు
2-04-2024	37 డిగ్రీలు
3-04-2024	38 డిగ్రీలు
4-04-2024	39 డిగ్రీలు
5-04-2024	40 డిగ్రీలు



ఆస్పత్రులు కిటకిట...

ఎండ తాపానికి అల్లాడిపోతున్న జనం ఆస్పత్రి బాటపడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఎక్కువగా చిన్న పిల్లలు ఎండ వేడికి జ్వరం బారిన పడుతున్నారు. వృద్ధులు సైతం మంచమెక్కుతున్నారు. రోజురోజుకూ వీరి సంఖ్య గణనీయం పెరుగుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ కేసులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షించి వడదెబ్బ అయితే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఎండ ఉష్ణోగ్రత పెరగడం, వడదెబ్బ కేసులు పెరగడంతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చాలా వరకు జనం మధ్యాహ్నం 11.30గంటలకు పైగా బయట అడుగు పెట్టాలంటే భయపెడుతున్నారు. ఉదయం వేళ పనులు ముగించుకుని ఇంటికే పరిమితమవుతున్నారు. ఈ కారణంగా మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి..

అప్రమత్తంగా ఉండాలి



ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేస్తున్నాం. పీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్‌ల వద్ద ఓఆర్ఎస్ కార్నర్‌లు ఏర్పాటు చేశాం. అలాగే ఉపాధి వేతనదారుల కోసం ఆశవర్కర్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నారు. త్వరలో జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో కూడా అందించేలా చర్యలు తీసుకుంటాం.

–రవిరాజు, ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ, చిత్తూరు

జాగ్రత్తలు ఇలా...



- ఎండలోకి వెళ్లేటప్పుడు గొడుగు వాడాలి
- తెలుపురంగు లేదా పలుచని చేనేత వస్త్రాలు ధరించాలి
- తలకు టోపీ గాని రుమాలు కానీ వాడాలి.
- వేడిగాలులు తగలకుండా చూసుకోవాలి.
- ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కాలంలో ఆరుబయట అధిక శారీరక శ్రమతో కూడిన పనిచేయరాదు
- ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ఒక గ్లాసు మంచి నీరు తాగాలి
- వీలైనన్ని ఎక్కువ సార్లు మంచి నీళ్లు తాగాలి.
- ఎండలో తిరిగే సమయంలో చల్లని నిమ్మ రసం, కొబ్బరినీరు, మంచి నీరు తరచూ తీసుకోవాలి
- జిల్లాలో 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఆశవర్కర్, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీల వద్ద కూడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. ఆశవర్కర్ వద్ద 200 ప్యాకెట్లు, ఏఎన్ఎం వద్ద 500 ప్యాకెట్లు, ఎంఎల్ హెచ్‌పి వద్ద 1000 ప్యాకెట్లు చొప్పున ఉంటాయి. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, పీహెచ్‌సీలకు వచ్చే వారికి ఓఆర్ఎస్ కార్నర్ ద్వారా ద్రావణాన్ని అందిస్తున్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

బంగారుపాళెం: భారతావనికి విశేష సేవలు అందించిన స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఉప ప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ ఆదర్శ మూర్తి అని విశ్రాంత ఎంఈఓ చంద్రన్ అన్నారు. మండలంలోని తగ్గువారిపల్లెలో జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం దళితనాయకులు, ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూజలు నిర్వహించి నివాళులర్పించారు. చంద్రన్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమర యోధుడిగా, సంఘ సంస్కరణవాదిగా, అంటరానితనాన్ని రూపుమాపేందుకు జగ్జీవన్‌రామ్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళితనాయకులు హేమచంద్ర, చిన్నదొరై, శ్రీరాములు, సుబ్రమణ్యం, కుమారస్వామి, రఘుపతిరాజు, పూర్ణయ్య శేఖర్, నరేష్, పాలాక్షి పాల్గొన్నారు.

గంగినేని పార్కులో..

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో శుక్రవారం దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గంగినేని పార్కులోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, దాసరి చంద్ర, గోపినాథ్, రఘు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


చిత్తూరు: జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, మేయర్ అముద

జగ్జీవన్‌రామ్‌కు ఎంపీ నివాళి

మాజీ ఉప ప్రధాని, సమతావాది బాబు జగ్జీవన్‌రామ్ అందరికీ ఆదర్శప్రాయుడని ఎంపీ రెడ్డెప్ప అన్నారు. గంగినేని చెరువులోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎంపీ, మేయర్ అముద పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని పిలుపునిచ్చారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి

పూతలపట్టు: పేద బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్‌ని జెడ్పీటీసీ దేవిక తెలిపారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్‌ని కొనియాడారు. అనంతరం పిల్లలకు మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ మునిరత్నం, జీవరత్నం, షణ్ముగం, జయపాల్, జేఈ మునిరత్నం, నాగరాజు, సుందర్‌రాజ్, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.


చిత్తూరు: విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు


పూతలపట్టు: జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు


బంగారుపాళెం: తగ్గువారిపల్లెలో నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

ఫ్యాను గుర్తుకు ఓటు... అభివృద్ధికి రూటు


ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డిని సన్మానిస్తున్న వ్యాపారులు

- ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ఫ్యాను గుర్తుకు ఓటేసి, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్ సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద గల కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ మేలు జరిగేలా జగనన్న ప్రభుత్వం పాలన సాగించిందని ఎంపీ రెడ్డప్ప అన్నారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చే ప్రతిపక్ష నాయకులను నమ్మవద్దన్నారు. గత నాలుగేళ్లుగా రూ.3.67 కోట్లు చెల్లించి గేటును వ్యాపారులకు ఉచితం చేసినట్లు విజయానందరెడ్డి తెలిపారు. కష్టపడి పనిచేస్తున్న మార్కెట్ వ్యాపారులు ఐక్యంగా ఉండాలని సూచించారు. గతంలో చిరువ్యాపారి దగ్గర నుంచి రోజు రూ.100 గేటు పేరిట వసూలు చేసేవారని గుర్తు చేశారు. ఆ లెక్కన గత పాలకులు అయి ఉంటే గేటు పేరిట రూ.15 కోట్లు దోచేసేవారని చెప్పారు. మార్కెట్ వ్యాపారుల కష్టాలు చూడలేక గేటును ఉచితం చేశామన్నారు. అందరూ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవాలని కోరారు. అధికారంలోకి వచ్చాక ఉచిత గేటు ఆనవాయితీని కొనసాగిస్తామన్నారు. కూరగాయలు నిల్వ ఉంచుకోవడానికి కోల్డ్‌స్టోరేజ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కూటమి నాయకుల ప్రలోభాలకు లొంగవద్దని పేర్కొన్నారు. గత పాలకులు మార్కెట్ వ్యాపారులపై పెత్తనం చేసేవారని గుర్తు చేశారు. టీడీపీ నాయకులు బెదిరిస్తే భయపడవద్దన్నారు. వారికి చెప్పండి మరో 50 రోజుల్లో జగనన్న రాజ్యం వస్తుందని అన్నారు. మీ ఇంట్లో మంచి జరిగి ఉంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు ఆను నాయకులు అల్తాఫ్ పాల్గొన్నారు.

బాబూ.. ఇంకా ఎంతమందిని చంపుతావ్..?


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు

- ఇప్పటికే 39 మంది పండుటాకులను పొట్టన పెట్టుకున్నాడు
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు

గుడిపాల: చంద్రబాబూ.. ఇంకా ఎంతమందిని పొట్టన పెట్టుకుంటావ్.. ఇప్పటికే 39మందిని చంపేశావ్? ఇకపై నీ ఆటలు సాగనివ్వం అని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జనార్దన్, ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, సీనియర్ నాయకులు మధుసూదన్‌రాయల్, యువత అధ్యక్షుడు శిలంబరసన్ ఆరోపించారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వారు మాట్లాడుతూ వలంటీర్లపై కక్ష గట్టిన తెలుగుదేశం నాయకులు పింఛన్ల పంపిణీని అడ్డుకుంటున్నారని చెప్పారు. ఫలితంగా మండలంలోని చుక్కావారిపల్లె గ్రామానికి చెందిన మురుగేష్(80) ఎండలో నడుచుకుంటూ వెళ్లి సొమ్మసిల్లి పోయి మృతిచెందడం వాస్తవం కాదా అన్నారు. ఇలా చంద్రబాబునాయుడు ఇప్పటికే రాష్ట్రంలో 39 మంది ప్రాణాలను బలి తీసుకున్నాడని పేర్కొన్నారు. రెండురోజులుగా వృద్ధులు నానా బాధలు పడుతున్నారని మురుగేష్ మృతితో పింఛన్‌దారులందరూ ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతామంటున్నారని వివరించారు. సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధిని చూసి చంద్రబాబు భయపడుతున్నారని అందుకే నానాయాగీ చేస్తూ పింఛన్ ఆపించినట్లు చెప్పారు. ఫ్యాను గుర్తుకు ఓటేసి జగనన్నను మళ్లీ సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, విజయానందరెడ్డి ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, చిట్టిబాబు, ప్రసాద్, వెంకటేష్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సాయిక్రిష్ణ, సెల్వం, దీన, విక్టర్, ప్రకాష్, సురేష్, రాకేష్, క్రిష్ణ, మోహన్, లారెన్స్, శ్రీరాములుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాణిపాక దేవస్థానానికి విరాళం

కాణిపాకం(చిత్తూరు రూరల్): కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి ఓ దాత శుక్రవారం నగదు విరాళం చేశారు. వెంకటగిరి కోటకు చెందిన రాజేశ్వరి దేవస్థానంలో నిర్వహించే అన్నదానానికి రూ.1,00,116లు అందజేశారు. ఆమెకు దర్శన భాగ్యం కల్పించి ఆలయ మర్యాదలు చేశారు.

టమాట ధరలకు రెక్కలు

- పలమనేరులో ప్రస్తుతం బాక్సు రూ.360
- బయటి రాష్ట్రాల్లో సరుకు తగ్గుముఖం
- అన్నమయ్య, అనంతపురం జిల్లాల్లో తగ్గిన పంట దిగుబడి

పలమనేరు: టమాట ధరలకు రెక్కలొస్తున్నాయి. వారం క్రితం రూ.200 నుంచి రూ.250 వరకు ఉన్న ధర నాలుగు రోజులుగా పెరుగుతోంది. శుక్రవారం బాక్సు (14 కేజీలు) టమాట రూ.360 పలికింది. స్థానికంగా సరుకు తగ్గడం, ప్రస్తుతం ఉన్న పంట కోతకు వచ్చేందుకు నెల సమయం ఉంది. ఈ కారణంగానే ధరలు పెరుగుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు ఎండల కారణంగా బయటి ప్రాంతాల సరుకు తగ్గడం కూడా ధరల పెరుగుదలకు కారణమైంది. ఈ ధరలు టమాట కోతకోస్తున్న రైతుల్లో ఆనందం నింపాయి.

బయటి రాష్ట్రాలకు ఎగుమతి

మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో అక్కడి లోకల్ టమాట సీజన్ ముగిసింది. దీంతో ఆ రాష్ట్రాల్లో డిమాండ్ కారణంగా అక్కడి వ్యాపారులు ఇక్కడికి వచ్చి కొంటున్నారు. మొన్నటి వరకూ స్థానిక వ్యాపారులే టమాట కొనుగోలు చేసేవారు. దీంతో ధరలు అంతంతమాత్రమే పలికాయి. ఇప్పుడు డిమాండ్ పెరగడంతో వ్యాపారుల రాక పెరిగి ధర పెరుగుతోంది.

లోకల్ సరుకు తగ్గుముఖం

ఈ ప్రాంతానికి ఎక్కువగా అన్నమయ్య, అనంతపురం జిల్లాల నుంచి టమాటాలు తీసుకువచ్చేవారు. ప్రస్తుతం ఎండ కారణంగా ఇది తగ్గుముఖం పట్టింది. ఇదే సమయంలో టమాట పండించే రాష్ట్రాల్లో పంట పెద్దగా లేకపోవడంతో ధర పెరుగుతోంది. లోకల్ సరుకు రోజుకు 10 లోడ్ల వరకూ ఈ మార్కెట్‌కు వచ్చేది. ప్రస్తుతం మూడు, నాలుగు లోడ్లు కూడా రావడం లేదు. ధరలు ఈ మాత్రం ఉన్నా ఈ సీజన్‌లో మార్కెట్లు అటు రైతులు, ఇటు వ్యాపారస్తులతో కళకళలాడటం ఖాయంగా కనిపిస్తోంది.


పలమనేరు మార్కెట్‌కొచ్చిన టమాటాలు

చిందేస్తాం..కూటమిని ఓడిస్తాం..!



మండిపేట, జే అగ్రహారంలో ప్రచారం రథం ముందు నృత్యం చేస్తున్న మహిళలు

బలిరా బలి బలిరా...
జెండాలు జతకట్టడమే మీ అజెండా
జనం గుండెల్లో గుడి కట్టడమే జగన్ అజెండా
బలిరా బలి బలిరా..

అనే పాట వైఎస్సార్‌సీపీ ప్రచార రథంలో వినిపిస్తే చాలు ప్రజలకు తెగ హుషారొచ్చేస్తోంది. పలమనేరు నియోజకవర్గంలోని పల్లెల్లో మహిళలు, పంట చేలల్లో కూలి పనులు మహిళా కూలీలు ప్రచార రథంలో ఈ పాట విని అక్కడికి చేరుకుని ఉత్సాహంతో నృత్యం చేస్తున్నారు. జగన్‌పై తమకున్న అంతులేని అభిమానాన్ని చాటుతున్నారు. నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లె మండలం చప్పిడిపల్లె పంచాయతీ జంగాళ అగ్రహారం, పలమనేరు మండలంలోని మండిపేటలో శుక్రవారం ఈ పాటను విని మహిళలు చిందేసిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ పాట తమకు రెట్టింపు ఉత్సాహం ఇస్తోందని, ఎన్ని కూటములొచ్చినా తామంతా మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటామని మహిళలు చెప్పారు.

- పలమనేరు